ఇక స్మార్ట్ మీటర్లు!

- తొలి విడత ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు
- తర్వాత గృహాలకు అమర్చడానికి సన్నద్ధం


జీవీఎంసీ 77వ వార్డు సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లు

పెదగంట్యాడ: ఆధునిక కాలంలో విస్తరిస్తున్న సాంకేతికతను ఇప్పుడు విద్యుత్ శాఖలో అమలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. స్మార్ట్ విద్యుత్ మీటర్లు అమర్చేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అది విజయవంతం అయితే ఇళ్లతో పాటు వాణిజ్య సంస్థలకు కూడా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

ఐఆర్‌డీ మీటర్లు కనుమరుగు! : ఇప్పటి వరకూ వినియోగంలో ఉన్న ఐఆర్‌డీ మీటర్లకు కాలం చెల్లనుంది. ప్రస్తుతం వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు చెల్లిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే సెల్ ఫోన్ మాదిరిగా ముందుగా రీచార్జి చేసుకోవాల్సి వస్తుంది. స్మార్ట్ మీటర్లలో సిమ్ ఉంటుంది. క్యూ ఆర్ కోడ్‌తో కూడిన మీటర్లను ఏర్పాటు చేయడంతో ఆ కోడ్‌ను వినియోగించి రీచార్జి చేసుకోవాలి. బ్యాలెన్స్ అయిపోయిన వెంటనే రీచార్జ్ చేసుకోకపోతే కరెంట్ కట్ అవుతుంది. వినియోగదారుడు ఏ మేర విద్యుత్ వినియోగిస్తున్నాడనే విషయం ప్రతి రోజు అతనికి, అధికారులకు సమాచారం అందజేస్తుంది.

ఆటోమెటిక్‌గా రీడింగ్ నమోదు : స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి వస్తే ప్రతి నెలా వినియోగదారుని ఇంటికి వచ్చి రీడింగ్ తీసుకునే అవసరం విద్యుత్ సిబ్బందికి ఉండదు. ఆటోమెటిక్‌గా రీడింగ్ నమోదు అవుతుంది. ఈ మీటర్లు అదానీ గ్రూప్ ద్వారా ప్రభుత్వానికి సరఫరా అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు..

తొలి విడత ప్రభుత్వ కార్యాలయాల్లో.. : ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో మిగిలిన విద్యుత్ కనెక్షన్లకు ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ విద్యుత్ మీటర్లు వేసే పనిలో విద్యుత్ శాఖాధికారులు నిమగ్నమై ఉన్నారు. పెదగంట్యాడ మండల వ్యాప్తంగా దాదాపు 60వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటిలో సుమారు 250 వరకూ ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు తొలి విడతగా కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్త విధానం వల్ల ప్రీపెయిడ్ మీటర్లకు ముందుగానే రీచార్జ్ చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ మీటర్లను ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లో బిగిస్తున్నారు. కానీ సిమ్ కార్డు అమర్చడం లేదు.. దశల వారీగా వాటిని ప్రీపెయిడ్ మీటర్లుగా మార్చనున్నారు.

మీటర్ రీడర్ల ఉపాధికి గండం!

స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు అందుబాటులోకి వస్తుండడంతో దీని ప్రభావం విద్యుత్ మీటర్ల రీడర్లపై పడనుంది.మండలంలో సుమారు 10 మంది విద్యుత్ మీటర్స్ రీడర్స్ పనిచేస్తున్నారు.. వారి ఉపాధికి గండి పడనుంది. వీరంతా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఒక మీటర్ రీడింగ్ తీసేందుకు రూ.5 చెల్లిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల కారణంగా వారంతా ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. తమ భవిష్యత్తు ఏంటని తలలు పట్టుకుంటున్నారు.


క్యూ ఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ విద్యుత్ మీటర్

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రస్తుతం మండల పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నాం. దశల వారీగా పరిశ్రమలు, గృహ సర్వీసులకు కూడా అమలు చేసే అవకాశం ఉంది. వీటి ద్వారా రీడింగ్ యూనిట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులు పొందవచ్చు. కరెంట్ కావాలంటే ముందుగా రీచార్జి చేసుకోవాలి. దీనిపై వినియోగదారులు అవగాహన కల్పిస్తాం.

– టీకే నాయుడు, ఈఈ జోన్-2, ఈపీడీసీఎల్

క్లుప్తంగా

అనధికార నిర్మాణం తొలగింపు


టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చివేసిన అనధికార నిర్మాణం

గాజువాక: జీవీఎంసీ 73వ వార్డు వుడా కాలనీ లో ఒక భవనంపై అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన అదనపు అంతస్తును జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సోమవారం తొలగించారు. ఈ నిర్మాణంపై స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు అదనపు అంతస్తు మొత్తాన్ని తొలగించా లని సిబ్బందిని ఆదేశించారు. దీంతో సిబ్బంది ఆ నిర్మాణానికి సంబంధించిన డెకింగ్ కూల్చివేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణా లు చేపట్టినా తొలగిస్తామని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ హరిదాసు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పెట్రోల్ బంక్‌కు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పెదగంట్యాడ ప్రాంతంలో పోలీస్ శాఖకు చెందిన సంస్థలో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం సాయంత్రం భూమి పూజ చేశారు. ఈ స్థలాన్ని బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు మంజూరు చేశారు. కార్యక్రమంలో డీసీపీ-2 మేరీ ప్రశాంతి, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో కణితి విద్యార్థి ప్రతిభ


విద్యార్థి మహేష్‌తో హెచ్ఎం, పీడీలు

అగనంపూడి: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో గాజువాక మండలం కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె. మహేష్ సత్తా చాటాడు. విజయనగరంలో మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో హెచ్ఎం సూర్య ప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.మన్నాజీ, నారాయణరావు, ఇతర ఉపాధ్యాయులు మహేష్‌ను అభినందించారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ధర్నా


ధర్నాలో పాల్గొన్న ఎల్ఐసీ ఏజెంట్లు

గాజువాక: పాలసీ తీసుకున్న ఏడాది తర్వాత పాలసీదారులు తమ పాలసీలను సరెండర్ చేసుకుంటే ఏజెంట్ నుంచి కమీషన్‌ను రికవరీ చేస్తామన్న ఎల్ఐసీ యాజమాన్యం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ సంస్థ గాజువాక బ్రాంచ్ ఏజెంట్లు సోమవారం ధర్నా నిర్వహించారు. పాలసీదారులకు సేవలందిస్తున్న ఏజెంట్లకు మెరుగైన ప్రోత్సాహం అందించడానికి బదులు కమీషన్లను రికవరీ చేస్తామనడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గాజువాక బ్రాంచి ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ నాయకులు పల్లి అప్పలనాయుడు, అమరపిన్ని రమణ, పాట్నూరు నాగేంద్రరావు, ఎల్.వి.రావు, పిల్లా ప్రసాద్, ఎం.డి.నజీర్, పల్లి అప్పారావు, జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి


దీపావళి కానుక పంపిణీ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులపై విలేకరులు నైపుణ్యం పెంపొందించుకొని ఎదగాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఏపీయూడబ్ల్యూజే గాజువాక అధ్యక్షుడు కొయిలాడ పరశురాం ఆధ్వర్యంలో బీసీ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం దీపావళి సంబరాలు నిర్వహించారు. సీపీ శంఖబ్రత బాగ్చి, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నిరాధార వార్తలు రాసి సమాజంలో చులకన కావద్దని సూచించారు. సమాజా నికి ఉపయోగపడే విధంగా విలేకరులు పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా దీపావళి కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు వర్మ, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రాము, కార్యదర్శి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


పొట్టి శ్రీరాములు కూడలి వద్ద నిరసన ప్రదర్శనలో కూటమి నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కూటమి (బీఎంఎస్, టీఎన్‌టీయూసీ, డీఎస్‌ఈయూ, వీఎస్‌పీఈయూ, వీయూఎస్‌ఎస్) నాయకులు సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉక్కు హిల్‌టాప్‌లోని పొట్టి శ్రీరాములు కూడలి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సమస్యలపై బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. కార్మికులందరికీ ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, తొలగించిన హెచ్ఆర్ఏను పునరుద్ధరించాలని, పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మినేని శ్రీనివాస్, నమ్మి సింహాద్రి, కోగంటి లెనిన్‌బాబు, బొడ్డు పైడిరాజు, కాండ్రేగుల శ్రీనివాసనాయుడు, ఎం.కె. రెడ్డి, కె.వి.ఎస్.ఎన్.రాజు, నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం


స్టీల్‌ప్లాంట్‌లో సమగ్రత ప్రతిజ్ఞలో పాల్గొన్న ఇన్‌చార్జి సీఎండీ, డైరెక్టర్లు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) మార్గదర్శకాల ప్రకారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో నిర్వహించిన సమగ్రత ప్రతిజ్ఞలో స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ ఎ.కె. సక్సేనా, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్. కరుణ రాజు, డైరెక్టర్లు ఎస్.సి. పాండే, గణేష్, జి.వి.ఎన్. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ ఎ.కె. సక్సేనా మాట్లాడుతూ ఉద్యోగులు విజిలెన్స్‌ను విధిగా మాత్రమే భావించకుండా న్యాయమైన, విశ్వసనీయమైన కార్యాలయాన్ని సృష్టించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. సంస్థలో నైతిక ప్రవర్తనను బలోపేతం చేయడమే కాకుండా కార్యకలాపాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి విజిలెన్స్ దోహదపడుతుందని చెప్పారు. సీవీవో డాక్టర్ కరుణరాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ రోల్‌మోడల్‌గా వ్యవహరించాలని కోరారు. అవినీతి రహిత వాతావరణం ప్రాముఖ్యతను వివరిస్తూ 'నేను లంచం ఇవ్వను, నేను లంచం తీసుకోను' అనే విధానాన్ని ప్రతీ ఉద్యోగి పాటించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్‌లో..

అగనంపూడి: దేశ సమగ్రత, సమైక్యతను కాపాడడానికి భారతపౌరులమైన మనం సన్నద్ధం కావాలని దువ్వాడ వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాసరావు అన్నారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ పరిపాలనా భవనంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులతో సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రపతి, దేశ ప్రధాని, ఉపరాష్ట్రపతి సందేశాలను చదివి ఉద్యోగులకు వినిపించారు. అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్లు ప్రసన్నకుమార్, కె.శ్రీనివాస్, ఐఆర్ఎస్ అధికారి వర్మ, కస్టమ్స్ అధికారి శివ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

పెదగంట్యాడ: ఆయుష్మాన్ భారత్ కార్డుల కోసం ఆశ వర్కర్లు దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ వర్కర్లతో సోమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు. ప్రజా సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాటు పడుతోందని చెప్పారు.పేదలకు ఉచితంగా రూ.5 లక్షల విలువైన వైద్యం అందించడానికి ఈ కార్డులు జారీ చేస్తున్నట్టు చెప్పారు. చేతి వృత్తుల కళాకారులకు రూ.15వేల విలువైన పనిముట్లు అందించేందుకు పీఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. వ్యాపారాల కోసం రూ.20లక్షల వరకూ ముద్ర రుణాలు అందిస్తున్నారని, పీఎం ఆవాస్ యోజన కింద ఇల్లు కట్టుకునే వారికి రూ.1.80 లక్షలు, పీఎం సూర్య ఘర్ వంటి పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. అనంతరం ఆశ వర్కర్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, సుజాత పాల్గొన్నారు.

రూ.2.79 కోట్ల ఆస్తి పన్ను వసూలు


జెడ్సీ శేషాద్రికి చెక్కులు అందజేస్తున్న రెవెన్యూ విభాగం అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగం అధికారులు సోమవారం రూ.2,79,28,000 ఆస్తి పన్ను వసూలు చేశారు. ఏపీఐఐసీ, ఐలా నుంచి రూ.2,68,39,111 పన్ను వసూలు చేయగా, గాజువాక జోన్‌లోని సాధారణ నివాసాల నుంచి రూ.10,65,000 ఆస్తి పన్ను వసూలు చేశారు. వీటికి సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐలు సుభాన్, రెడ్డి మోహన్, కోరాడ శివ సోమవారం జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రికి అందజేశారు. రెవెన్యూ అధికారులను ఈ సందర్భంగా జెడ్సీ అభినందించారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు


ఉత్సవ కమిటీతో మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కూర్మన్నపాలెంలోని గౌరీ పరమేశ్వరుల ఆలయంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.పార్వతీ పరమేశ్వరుల ప్రతిమలను కూర్మన్నపాలెం, వడ్లపూడి నిర్వాసితకాలనీల్లో ఊరేగించి ఆలయ ఆవరణలో ప్రతిమలను ప్రతిష్టింపజేశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దర్శించుకుని విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 87వ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, గౌరీ సేవా సంఘం పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా


ధర్నాలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

గాజువాక: పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదాయ పన్ను పేరుతో జీతాల్లో కోత విధించిన మొత్తాన్ని తమ ఖాతాల్లో జమ చేయాలన్నారు. గాజువాక విలీన పంచాయతీ కార్మికుల పీఎఫ్ సొమ్ము చెల్లించాలని, డెత్, సిక్, రిటైరైన కార్మికుల వారసులకు ఉపాధి కల్పించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులతో అధికారులు, రాజకీయ నాయకులు తమ ఇళ్లవద్ద పని చేయించుకొంటున్నారని, వారిని తక్షణమే అక్కడి నుంచి ఉపసంహరించి విధులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. విజయవాడ వరదల ముంపు సందర్భంగా స్పెషల్ డ్యూటీలు చేసిన కార్మికులకు నెల జీతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉరుకూటి రాజు, కె.కిరీటం, కె.వి.రమణ, మీనాక్షి, సత్యవతి, గణేష్, చిన్నారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఘన స్వాగతం


మంత్రి బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: ఢిల్లీ నుంచి విశాఖ విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు గాజువాక బీజేపీ నాయకులు విశాఖ విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు శాలువా, పుష్ప గుచ్ఛాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వరరావు, రంగ నాయకులు, రంజిత్, నరేంద్ర, రామస్వామి, శ్రీను, రాజశేఖర్, యువశ్రీ, మనోహర్, రామునాయుడు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

పెదగంట్యాడ: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ అన్నారు. యాతపాలెం గ్రామంలోని పల్లి వీధిలో రూ.20 లక్షలతో సోమవారం సీసీ రోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులను పరిశీలించిన ఆయన మాట్లాడారు. రాళ్లను తొలగించి, కాలువలు నిర్మించి రోడ్డు పనులు చేపట్టామన్నారు. వార్డులో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నీటి వృథాను అరికట్టరూ!

ఫోకస్


పైప్‌లైన్ లీకేజీ కారణంగా వుడా ఫేజ్-1లో వృథాగా పోతున్న నీరు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు వుడాఫేజ్-1 రాజీవ్‌నగర్‌లో మంచినీటి పైప్ లైన్ పగిలిపోవడంతో కొన్ని రోజుల నుంచి నీరు వృథాగా పోతోంది. ఫేజ్-1లో ఎంఐజీ 32 క్వార్టర్స్‌కు సమీపంలో పైప్ లైన్ పగిలిపోవడంతో నీరు నిరంతరంగా పారుతుండడంతో మురుగునీటి కూపంలా మారి పోయింది. దీంతో పందులు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నీటి వృథాను అరికట్టాలని పలు మార్లు సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఎన్టీపీసీ కాలుష్యం నుంచి రక్షించండి


పిట్టవానిపాలెంలో ఎన్టీపీసీ సింహాద్రికి చెందిన యాష్ పాండ్

పెదగంట్యాడ: ఎన్టీపీసీ సింహాద్రికి చెందిన యాష్ పాండ్ నుంచి వచ్చే దుమ్ము, ధూళి కారణంగా అనారోగ్య సమస్యలతో సతమతవుతున్నామని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పిట్టవానిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం బారి నుంచి తమను రక్షించాలని ఎన్టీపీసీ హెచ్ఆర్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ యాష్ పాండ్ నుంచి నిత్యం దుమ్ము, ధూళి ఎగసి పడుతోందని, అలాగే యాష్ పాండ్‌కు లారీల్లో యాష్‌ను తరలిస్తుండడంతో రహదారులు మొత్తం దుమ్ము రేగుతోందని చెప్పారు. దుమ్ము, ధూళి కారణంగా ఊపిరితిత్తుల సమస్యలతో పాటు చర్మంపై మచ్చలు, కంటి సమస్యలు, కిడ్నీ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నా ఎన్టీపీసీ యాజమాన్యం నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కాలుష్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గాజువాకలో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి



న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా

గాజువాక: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న గాజువాకలో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీతో గాజువాక బార్ అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటరాక్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై స్పందించారు. బార్ అసోసియేషన్ వినతి మేరకు మల్కాపురం సివిల్ అధికార పరిధిని గాజువాక కోర్టు పరిధిలో చేర్చడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బార్ అసోసియేషన్‌కు శాశ్వత భవనం నిర్మించడానికి సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభాకరరావు, పుల్లయ్య నాయుడు, సీనియర్ న్యాయవాదులు వి.కోదండ రామయ్య, బి.మురళీ కృష్ణరాజు, జి.చిరంజీవి, వెన్నెల ఈశ్వరరావు, పి.రాంబాబు, లెనిన్ బాబు, వి.శ్రీనివాసరావు, భాను తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల రక్తదానం


రక్తదానం చేస్తున్న పోలీసులు

గాజువాక: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గాజువాక పోలీసులు సోమవారం రక్తదానం చేశారు. గాజువాక క్లబ్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డీసీపీ-2 మేరీ ప్రశాంతి, సౌత్ ఏసీపీ త్రినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో సందర్భంగా రక్తదానం చేయడం హర్షణీయమన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించే విధంగా అందరూ నడుచుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న కృషి ఎంతో ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో సీఐ పార్థసారథి, గాజువాక క్లబ్ అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.